# చెర

చాలా కథలు రాశాను; చాలా కథలు విన్నాను, చదివాను. కానీ, ముత్యం కథ ఇలా ముగుస్తుందని కలలో కూడా ఊహించలేదు నేను!

***

పథ్యం తిని ఇవాళ్టికి రెండోరోజు. మూడు వారాల టైఫాయిడ్ సుభద్రని పీల్చి పిప్పిచేసింది. ఇంకా త్రాణ రాలేదు. తనకు హార్లిక్స్ ఇచ్చి నేను టీ తెచ్చుకున్నాను. కుర్చీలో ముందుకు వంగి హార్లిక్స్ తాగుతోంది సుభద్ర.

పరీక్షగా ఆమెకేసి చూశాను. అసలే పచ్చని మనిషేమో వొక వన్నె తరిగి, శలాకలావుంది. కళ్లల్లో నీరసం.

'వీళ్లు ఎప్పుడు వస్తారో ఏమో?' అంటూ వచ్చి నాపక్కనే కింద కూర్చుంది. 'ఒక ఉత్తరం ముక్క వేయకూడదూ?' తనలో తను అనుకుంటున్నట్టు పైకే అన్నది.

నేను ఏమీ మాట్లాడలేదు.

వారం క్రితం ఉదయాన్నే దిగారు వేణూ, లక్ష్మీ, సుధ, రమణ. వేణు మా అబ్బాయి; లక్ష్మి కోడలు. సుధ, రమణ వాళ్ల పిల్లలు.

కళ్లల్లో ప్రాణంతో వున్నా వాళ్ల యోగక్షేమాల ధ్యాసే సుభద్రకి. టిఫిన్ తెప్పించింది. చకచకా తయారై టిఫిన్ కాఫీలు ముగించారు వాళ్లు.

'బాపట్ల వెళ్తున్నాం. మూడోతేది బుధవారం రాత్రికి మా ఢిల్లీ ప్రయాణం. ఈ లోగా వస్తాం' అంటూ వెళ్లిపోయారు.

బాపట్ల వేణు అత్తగారి ఊరు. తిరుగుప్రయాణంలో మళ్లీ మజిలీ... ఇక్కడ!

ఎప్పుడు వస్తారో తెలీదు. అదీ సుభద్ర ఆందోళన!

నా ఆలోచన పరిపరి విధాలుగా సాగింది.

వెళ్తూ వెళ్తూ వేణూ చెప్పిపోయిన విషయం గుర్తుకొచ్చింది. 'కోటమ్మని పిలిచి మాట్లాడండి. ఎట్టాగైనా సరే ఆమెని వొప్పించే బాధ్యత మీదే'.

కోటమ్మ-కాంతయ్య భార్య. కాంతయ్యంటే నాకు చిన్నప్పట్నుంచీ జతగాడు. ఆ కాలంలో కాంతయ్య తాత మా తాతల దగ్గర పనిచేసేవాడుట. అయినా అన్నదమ్ముల్లా మసిలిన వాళ్ళు. వాళ్ళ రోజులు పోయినై. వాళ్లూ పోయారు. ఆ మళ్లూ మాగాణాలూ.. అన్నీ పోయినై.

నేను టీచర్‌గా కుదురుకున్నాను. కాంతయ్యకి జనపనార తాళ్లు పేనడమే వృత్తిగా మారింది. వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా ఒకటి రెండు గేదెల్ని సాకుతోంది, కోటమ్మ. వీళ్లకి నలుగురు సంతానం. నలుగురూ ఆడపిల్లలే. అక్కడక్కడా సంసారాలు చేసుకుంటున్నారు. అయితే పెద్దపిల్ల యశోద వీళ్లతోనే వుంటుంది. ఆమె భర్త వో పుతారూపాయి; తాగుబోతు. వాళ్లకీ నలగురు ఆడ సంతానం. కాంతయ్యకీ, కోటమ్మకీ.. యశోద సంసారం వెన్ను మీద వుందు.

కాంతయ్యకో చిత్రమైన అలవాటుంది. మా వూరినుంచీ పట్నాలకి పోయి ఉంటేలేవాళ్ల భోగట్టా, ఉద్యోగాలు చేసే వాళ్ల వివరాలూ ఆయనకి కంఠోపాఠం. వీటికో చిటావుంది.

వాళ్లందరికీ అడపాదడపా వో కార్డు ముక్క గీకుతూ వుంటాడు. దసరాకి జమ్మిపూజ అంటాడు; కృష్ణాష్టమికి ఉట్టి కొట్టాలంటాడు. శ్రీరామ నవమికి పందిళ్ళు, కళ్యాణం అంటాడు. హనుమజ్జయంతికి తాలింఖానాలో సంబరాలంటాడు. మధ్య మధ్యలో భాగవత సప్తాహాలంటాడు. అవీ ఇవీ లేనప్పుడు హరికథలూ, పద్య నాటకాలూ వుండనే వుంటై. తోచిన విరాళం పంపమని విన్నవించుకుంటాడు. వాటితో ఈ హడావిడి అయిందనిపిస్తూ వుంటాడు.

అదుగో... అలా గీకిన ఒక కార్డు ముక్కలో యశోద సంసారం గురించి వ్రాస్తూ... ఆమె కూతురు ముత్యం గురించి వ్రాశాడుట, వేణూకి.

ముత్యంని ఢిల్లీ పంపమని వేణూ అడగడం, కాంతయ్య సరేననడం...

జాబులూ జవాబుల్లో జరిగిపోయింది. ముత్యంని తమతో వుంచుకుంటే ఇంటిపనికి సహాయంగా ఉంటుందని వేణూ లక్ష్మిల ఆలోచన.

ఈ సంగతి కోటమ్మకి తెలిసింది. చాలా సార్లు ఈ విషయం నాతో మాట్లాడింది. మనవరాలు ముత్యంని ఢిల్లీ పంపటం ఆమెకు సుతరామూ ఇష్టంలేదు.

అందుకనే 'ఆ కోటమ్మని ఎలాగైనా ఒప్పించటం మీ బాధ్యత' అంటూ వేణూ నాకు హెచ్చరిక చేసి వెళ్లింది.

నాకు మనసు మనసులో లేదు. హాల్లో పచార్లు చేయసాగాను.

'ఇంటిపనితో కోడలు అస్సలు తెమల్లేక పోతోందిట. వాడికీ ఊపిరాడటంలేదుట. ఇద్దరూ ఉద్యోగాలు వెలగబెడుతుంటే ఇవే ఈతి బాధలు' మాటల్ని కూడగట్టుకుంటూ, నీరసంగా చెప్పుకు పోతోంది సుభద్ర.

'ఆ పిల్లల్ని చూడండి. ఒక మెరుపూ లేదు. నేవళవూ లేదు. రహదారి పక్కన దీపస్తంభాల్లా వున్నారు. ఈ వయస్సులో ఎట్లా వుండాల్సిన వాళ్లు ఎల్లా వున్నారు? వాడికి వాడు మాత్రం చిక్కి పోయి పళ్ల బిగువున తిరుగుతున్నాడు. ఏం ఉద్యోగాలో, ఏం ఊళ్లో. పట్నవాసపు బతుక్కు వొక సుఖమూ లేదూ, శాంతీ లేదు. మొహాల మీద సంతోషాన్ని పులుముకుని తిరుగుతున్నా, ఆ కళ్లల్లో దిగుళ్లూ, ఆ మనసుల్లో బెంగలూ మనకు తెలీకుండా పోతాయ్యా. ఏవిటో... పిచ్చి మొద్దు. వాళ్ల పరిస్థితిని తలుచుకుంటే నాకు బాధగానే వుంది.'

సుభద్ర మనసూ మాటా నాకు తెలీనివి కావు. కొడుకు ఇబ్బందులకి తల్లి గుండె తడి అది! అందుకనే ఆమె మాటలూ చెమ్మగిల్లినై.

అయినా ఎందుకనో ముత్యం విషయంలో వీళ్ల ఆలోచనలు చిట్లిన పాళీతో రాసిన రాతలుగానే తోచినై నాకు. పదేళ్ల ముత్యం నాకళ్లల్లోకి చూస్తూ మా మనవరాలు సుధ పక్కన నిలిచి ఏవో ప్రశ్నల బాణాలు గుప్పిస్తున్న భావనే కలుగసాగింది నాకు.

దీనికి బహుశా నాలోని ఉపాధ్యాయ మనస్తత్వమే కారణమనుకుంటాను!

'అదేంకాదు. మీది మరీ చిత్రమైన తత్వం. ఆకు రాలే చప్పుడూ భరించలేరు. తలుపువేసే సవ్వడీ భరించలేరు. ఎవరికో ఇంజెక్షన్ ఇస్తున్నా మీకు ముల్లు గుచ్చుకున్నట్లౌతుంది. హాస్పిటల్ వాతావరణమంటే బెరుకు, భయం.' ఇలా చాలా ఉదహరిస్తూ పోతుంది సుభద్ర.

కణతలు నొక్కుకుని కళ్ళు మూసుకున్నాను. కళ్ల ముందు రంగులు వెలార్చుతూ దిక్చక్రం తిరుగుతోంది!

చీకటి పడింది.

ఎనిమిదింటికి గుప్పెడు మెతుకులు తిని ఆ లాంఛనం అయిందనిపించుకున్నాం.

పక్కమీదికి చేరేనేగానీ... నిద్ర రావడం లేదు. కలత నిద్ర. ఎవేవో చిత్రాలూ... దృశ్యాలూ...

క్రితం వారం టీ.వి.లో చూసిన సాక్షి కార్యక్రమం. సున్నపుబట్టీల్లో... అగ్గిసెగల్లో పనిచేస్తున్న పిల్లలు. వాళ్లందరి కళ్లల్లో బతుకు భయం. కొలిమితిత్తుల్లాంటి ఊపిరి తిత్తుల్లో, మరమనుషుల్లా...కాళ్లూ చేతులూ వినియోగిస్తున్నా ఆసులో గొట్టాలు! ఏ ముని శాపవశాన్నో భూమ్మీదకి విరిగి పడిన మబ్బు తునకలు! దొల్లలు, నత్తగుల్లలు!

'ఆదివారం సెలవు వుందా?' అని అడిగితే 'ఉంది' అన్న ఆ పిల్ల జవాబు! ఆ వెంటనే 'ఇవాళ ఆదివారమే గదా, మరి పని చేస్తున్నావేం' అని ప్రశ్నిస్తే... మొహం పక్కకి తిప్పుకుని నవ్విన నవ్వు! సభ్య సమాజం మీదికి ఎక్కు పెట్టిన వాడి బాణం కాదూ.. ఆ నవ్వు!

పక్కలో అటూ ఇటూ మసిలాను. టవల్‌తో కళ్లు తుడుచుకున్నాను

నిద్రరాదు. నిద్ర రాకుండానూ వుండదు. మస్తిష్కంలో ఏదో యుద్ధభేరీల

మోత! కళ్లు బరువుగా... రెప్పలు తేలిపోతున్నె. దినపత్రికలో బాలకార్మికుల మీద సీరియల్‌లో సంఘటనలు... విజయవాడ వెళ్తే... పక్కింట్లో చూసిన అగ్గిపుల్లల ఫ్రేములు! పిల్లలు కాంట్రాక్టు తెచ్చి పేరుస్తున్న అగ్గిపుల్లలు. ఉదయం నుంచీ రాత్రి వరకూ విస్తరించిన చిన్నారి చేతుల, చేతి వ్రేళ్లశ్రమ. కాదు శ్రమ నీడ. వారం తర్వాత చేతిలో పడే చిల్లర పైసలు! చెరుకురసం తీసే యంత్రం. ప్రక్కన ఆ రెండు చిన్ని గాజు కళ్లు! హోటళ్లలో కుదురుకుని, కుదించుకుపోయి, కుమిలిపోతున్న క్లీనర్లు. వాళ్ల ఇరుకు బతుకు! దేశంలో నిజంగా చట్టాలు అమలులో ఉన్నాయా?

జీవితాల్ని నలగ్గొడుతున్న సంఘం!

మస్తిష్కంలో శతకోటి ప్రశ్నలు, అనంతకోటి అనుమానాలు! అవ్యక్తమైన ఆవేదన, ఆవేదనకాదు. అంతర్దాహం. కాదు కాదు, అంతర్దావానలం!

***

తెల్లవారింది.

నా పనులన్నీ అయిన తరువాత కాంతయ్య ఇంటికి వెళ్లాను. అంతా వున్నారు. వాళ్ళు చెప్పేవి... సోదలు కలబోసుకోవడం జరిగింది. నేను వచ్చేస్తుంటే... దూడకి పచ్చి మేత తెచ్చుకోవాలంటూ తనూ నాతో కాలు సాగించింది, కోటమ్మ. కొంతదూరం ఆమెతో మాట్లాడుతూ నడిచి నేను ఇంటికి వచ్చేశాను. నా మనస్సులో మాటని కొంచెం గట్టిగానే ఆమెతో చెప్పేశాను. నా సలహాకి ఆమె కళ్లు మెరిశాయి!

***

మంగళవారం తెల్లవారుతూనే వేణూ, లక్ష్మి, పిల్లలూ దిగారు. సుభద్ర తాను లేచి ఏదో చేయాలని చూచింది కాని శక్తి చాల్లేదు. సుధ, రమణల్ని పెట్టుకొని గోడకి ఆనుక్కూచ్చుంది. అమ్మమ్మగారింటి కబుర్లు చెబుతున్నారు వాళ్లు.

నేను వెళ్లి కనకమ్మను పిలుచుకొచ్చాను. ఇట్టాంటి అవసరాల్లో వంటా

వార్పుకి ఆమే మాకు సహాయం. సుభద్ర తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

పదిగంటలకి కాంతయ్యనీ, కోటమ్మనీ పిలిపించాను. వాళ్లతోపాటు ముత్యం కూడా వచ్చింది

మాటలు సాగినై. ఇటు వేణూ, లక్ష్మీ, అటు కాంతయ్యా, కోటమ్మా. ఎవరిఇబ్బందుల్ని వారు ఏకరువు పెట్టుకున్నారు. ముత్యంని గమనించాను. సుధ దగ్గర కూర్చుని ఆమె చెప్పే విషయాల్ని ఆసక్తిగా వింటోంది. సుధచేతిలో బోలెడు పుస్తకాలు!

వేణు, లక్ష్మి - కాంతయ్యా కోటమ్మల మధ్య చాలా ఆట నడిచింది. బంతి ఈ కోర్టులోనుంచి ఆ కోర్టులోకి, ఆకోర్టులోనుంచి ఈ కోర్టులోకి మారుతూనే ఉంది. నేను చూస్తూ కూర్చున్నాను. సుభద్ర మధ్యలో ఏదో అనబోయి ఆగిపోయింది.

కోటమ్మ- కాంతయ్య జగడానికి దిగారు. ముత్యంని చదివించి ఉద్యోగం చేయిస్తానంటుంది కోటమ్మ. 'ఉట్టికెక్కలేనమ్మవి, స్వర్గానికి నిచ్చెనలు పేనమాక' అంటాడు కాంతయ్య. అతని హెచ్చరిక వెనుక అసలైన ఆకర్షణ - పైసలు! కోటమ్మ పట్టుదల వెనుక బలం- ముత్యం తెలివిగల పిల్ల, చదువులో చురుకు, బుద్ధిమంతురాలు అనే నమ్మకం, గురి!

పన్నెండు గంటలవుతోంది. ఉన్నట్టుండి యశోద ఊడి పడింది. వస్తూనే అమ్మానాన్నలమీద ఉరుములు కురిపించింది. మిట్ట మధ్యాహ్నపుటెండలా మిటమిటలాడింది.'పిల్ల తల్లిని, నా ఆమోదం లేకుండా ఏమిటీ చర్చలు?' అని నిలదీసింది.

చాలా సేపు వాళ్ళంతా నీకు తెలీదంటే నీకు తెలీదని ఒకర్నొకరు చివాట్లు పెట్టుకున్నారు. సంప్రదింపులకి ముగ్గురూ కలిసి పెరట్లోకి వెళ్లారు. ముత్యంని పిలిచారు. ఆతర్వాత- వేణూ లక్ష్మి కూడా అక్కడికి వెళ్లారు. మా బాదంచెట్టు ఆకులు వీళ్ల మాటల్ని జాగ్రత్తగా ఆలకించినై.

ఓ పావుగంటకి - ఏడుస్తూ వెళ్లిపోయింది ముత్యం.

వీళ్లంతా లోపలికి వచ్చారు.

క్షణాల తరువాత- కోటమ్మా జారుకుంది, సుభద్ర ఆరోగ్యం గురించి పరామర్శించిన తరువాత.

కనకమ్మ పోసిన కాఫీలతో... వాతావరణంలో పొగలూ, సెగలూ చల్లారినై.!!

కాంతయ్యా, యశోదా వెళ్లబోతుండగా అన్నది లక్ష్మి, 'సరే. నువ్వడిగినట్టే కానియ్. పిల్ల పోషణంతా చూసి ఏడాదికి పదిహేను వందలిస్తాను. మేం వచ్చినప్పుడల్లా తనూ వచ్చి మిమ్మల్ని చూసి పోతూ ఉంటుంది. సరేనా' యశోద మొహం కళకళ్లాడింది. 'అట్టాగే' అంది.

వాళ్ళు వెళ్లి పోయారు. 'యశోద దేవాంతకురాలు.' అంది లక్ష్మి భర్తనుద్దేశించి. 'ఆమె దబ్బు మనిషి అని మీరు బాగానే పసిగట్టారు. అందుకనే బేరం తెగింది.' అని వేణూని మెచ్చుకుంది.

నేను అన్యమనస్కంగా మారాను. ఏదో తెలీని అస్థిమితత్వం మొదలైంది నాలో. ఊపిరి బిగుస్తున్న భావన కలుగుతోంది!!

లేచి వెళ్లి మంచంమీద పడుకున్నాను.

***

బుధవారం వచ్చింది. మధ్యాహ్నం మూడుగంటలౌతుంది. వాతావరణం మారుతోంది. పైన మబ్బులు కమ్ముతున్నై. గాలి ఒంటికి ఆనడంలేదు. దుమ్ము రేగుతోంది.

సుభద్ర కనకమ్మ దగ్గర కూర్చుని ఏవో వంటకాలు చేయిస్తోంది, పిల్లలకి ఇచ్చి పంపడానికి. వేణూ లక్ష్మి పిల్లలూ గదిలో నిద్రలో ఉన్నారు. నేను టీ తాగి పేపర్లో మిగిలిన వార్తలు చదువుకుంటున్నాను.

అదుగో సరిగ్గా అప్పుడు వచ్చేసింది, ఉప్పెన.

కాంతయ్య, యశోద, ఆమె మొగుడూ దూకుడుగా వచ్చారు. వాళ్ల వెనుగ్గా చాలా మంది ఉన్నారు.

ఉదయం నుంచీ కోటమ్మా, ముత్యం కనపడటం లేదు!

ఆ తర్వాత చాలా రచ్చ జరిగింది. అదంతా ఒక అపస్వరాల పుట్ట. అసహ్య పదజాలాల గుట్ట!

ఆ రాత్రికి

వేణూ లక్ష్మీ పిల్లలూ ఢిల్లీ వెళ్లిపోయారు. పోతూ పోతూ వేణూ లక్ష్మీ జరిగిన దానికంతా నాదే బాధ్యత అన్నట్టు ఒక యాగీ చేసి పోయారు. వాళ్లమాటలకి ఎందుకనో నా మనసు చివుక్కుమనలేదు!!

కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాను. దూరంగా రావి చెట్టు కొమ్మలు గాలికి ఊగుతున్నై. సన్నగా జల్లు మొదలైంది.

***

రోజులూ వారాలూ గడిచిపోతున్నై. కోటమ్మా ముత్యంల జాడలేదు. ఎన్నో ప్రయత్నాలు జరిగినై గాని, ఫలితం దక్కలేదు. ప్రశ్న అడగడం, అంజనాలు వేయించడం, జ్యోతిష్యాలు చెప్పించడం అన్నీ విఫల యత్నాలే అయినై. రోజుకోసారి మాయింటి మీద దాడీ, నిందలూ, నిష్టూరాలు సాగిపోతున్నై. ఇళ్లూ వీధులూ బావురుమంటున్న వాతావరణం నెలకొంది.

ఆరు నెలలు గడిచినై. ఒక నిర్ణయానికొచ్చేశాను నేను. తగిన ఏర్పాట్లు చేసుకున్నాను.

ఆ రాత్రి,

మా శాంతినీ సహనాన్నీ మెక్కి చుట్టచుట్టుకు పడుకున్న ఊరు కొండచిలువకు మేమే వీడ్కోలు చెప్పి వెళ్లిపోయాం.

మా మకాం హైదరాబాదుకు మారింది.

రెండేళ్లయింది.

ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడూ, ప్రశాంతమైన సాయంత్రాల్లోనూ, పచ్చని చెట్లూ, రంగురంగుల పూలూ, గాలికి అలవోకగా ఊగుతున్నప్పుడూ, బిర్లా మందిరం దీప కాంతుల్ని ఆనందిస్తున్నప్పుడూ....

నాకు కోటమ్మా, ముత్యం గుర్తుకొస్తూనే వుంటారు.

నా ఆశాభావం మీద నాకున్న నమ్మకం కన్నా... నా మాట మీద తనకున్న విశ్వాసం గట్టిదని నిరూపించిందా కోటమ్మ? అనిపిస్తూ వుంటుంది నాకు.

అంతలోనే ఒక జటిల ప్రశ్న ఎదురుగా నిలుస్తుంది. 'నిజంగా వీళ్లిద్దరూ ఏమైనట్టూ?'

ఏమో... విపులాచ పృథ్వీ!!

ముత్యంని విద్యాధికురాలిగా, ఉన్నతోద్యోగినిగా చూడాలనే ఆశ, ఆకాంక్ష... స్వర్ణాక్షరాలుగా నా హృదయఫలకం మీద అలాగే నిలిచి వెలుగుతూనే వున్నై!!

ఇదంతా కథే అయివుంటే దీన్ని సుఖాంతమో దుఃఖాంతమో చేయడానికి మరో పదిపంక్తులు వ్రాయవచ్చు. సారీ సార్! ఇది సూదిమొన లాంటిజీవితం. అందుకనే వాళ్లింకా నాకు తటస్థపడలేదు.

అన్నట్టు ఇవాళ మా వేణు ఉత్తరం వ్రాశాడు. బాపట్ల నుంచి సీత అనే పిల్లని పిలిపించుకున్నారుట. ఇంటి పనులకోసం!

ముత్యం గురించి ఇంత చెప్పిన తర్వాత, సీత గురించి మిమ్మల్ని అడగడమే ఉచితమనిపిస్తోంది. చెప్పండి మరి!!!

***

(జాగృతి - స్వదేశీ పారిశ్రామిక ప్రత్యేక సంచిక 1992)